సాక్షి మంచిర్యాల

శుక్రవారం ; 17 ; అక్టోబర్ ; 2025



విప్లవోద్యమం ఇక చరిత్రే!

ఉమ్మడి జిల్లాకు చెందిన మావోయిస్టులు కొందరు అమరత్వం పొందగా.. మరికొందరు లొంగుబాట పట్టారు. ఫలితంగా విప్లవోద్యమం ఇక చరిత్రగానే మారనుంది. 10లో▸

గాలికుంటు నివారణకు డ్రైవ్



జిల్లాలో గాలికుంటు వ్యాధి నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. నెలరోజుల పాటు ఊరూరా వైద్య శిబిరాలు నిర్వహించి పశువులకు టీకాలు వేస్తారు. 11లో▸

గరిష్టం/కనిష్టం

32.0 /24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

యుద్ధప్రాతిపదికన వ్యవసాయ కనెక్షన్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయ కనెక్షన్లు ఇస్తున్నామని, గత ఏడాది కంటే ఈ ఏడాది 11.4శాతం అధికంగా కనెక్షన్లు ఇచ్చామని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఉత్తమ్‌జాడే ఒక ప్రకటనలో తెలిపారు. స్తంభాలు, లైన్లు లేని ప్రాంతాల్లో ఒక నెల రోజుల్లో సర్వీసులు ఇస్తామని పేర్కొన్నారు. ప్రతీ వారం, నెల వారీగా ప్రత్యేకంగా వ్యవసాయ సర్వీసుల మంజూరుపై సమీక్షిస్తున్నామని తెలిపారు. స్టోర్‌లో కావాల్సిన మెటీరియల్ అవసరం మేరకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపా రు. విద్యుత్ లైన్ కోసం రైతులు మెటీరియల్ కొనొద్దని, ఎవరూ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇబ్బందులు ఏర్పడితే 1912 నంబరులో తెలియజేయాలని తెలిపారు.

ఏరియా ఆసుపత్రిలో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న కోటేశ్వర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కోటేశ్వర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాల వార్డులు, లేబర్ రూమ్‌లు, ల్యాబ్, డయాలసిస్ సెంటర్, రికార్డులు పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు అందిస్తున్న భోజనంపై ఆరా తీశారు. రోగులకు సరైన వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ జోస్పిన్, జూనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, ల్యాబ్‌టెక్నీషియన్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మహిళలకు చీర సారె అందజేస్తున్న సబ్‌కలెక్టర్ మనోజ్

బెల్లంపల్లిరూరల్: పౌష్టికాహారం ప్రతీ రోజు తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సబ్ కలెక్టర్ మనోజ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని గురిజాల రైతువేదికలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషక విలువలు కలిగిన ఆకుకూరలు, పప్పుదినుసులు క్రమం తప్పకుండా ఆహారంగా తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలకలు ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణులకు ఐసీడీఎస్ సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు చీరసారెలు అందజేశారు. సీడీపీవో స్వరూపరాణి, తాళ్లగురిజాల పీహెచ్‌సీ వైద్యాధికారి ఇవాంజలీన్, పోషణ అభియాన్ జిల్లా కో–ఆర్డినేటర్ రజిత, డీపీఏ శ్యామల, మహిళా హబ్ జిల్లా కో–ఆర్డినేటర్ సౌజన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

దండేపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఇటీవల గుడిపేటలో జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అండర్–14 విభాగంలో మండలంలోని కన్నెపల్లి మదర్ థెరిస్సా పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి మాన్యజ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆమెను ప్రిన్సిపాల్ అనూప్ జార్జ్, మేనేజర్ షైన్, కరస్పాండెంట్ లింటో, పీఈటీ దీపిక అభినందించారు. హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

కొత్తవారికే డీసీసీ పీఠం!

- జిల్లా అధ్యక్ష పదవికి పలువురు పోటీ
- 'హస్తం' పార్టీలో నాయకుల హడావుడి
- అందరి అర్జీలు స్వీకరిస్తున్న ఏఐసీసీ పరిశీలకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులుగా కొత్తవారికే అవకాశం దక్కనుంది. పార్టీ అధిష్టానం విధించిన నియమాలే అందుకు కారణమని స్పష్టమవుతోంది. వరుసగా ఐదేళ్ల పాటు పార్టీలో పని చేసిన కార్యకర్తలు, నాయకులు డీసీసీ అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు కనీస అర్హతగా నిర్ణయించారు. అంతేగాక ప్రస్తుతం అధ్యక్షులుగా ఉన్నవారికి మరోసారి ఇచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. అలాగే ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధువులకు కాకుండా పార్టీలోని ఇతరులకే అవకాశం కల్పించాలని నిర్ణయించారు. దీంతో జిల్లాలో సీనియర్లుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు పోటీ పడుతున్నారు. ఈ మేరకు ఏఐసీసీ పరిశీలకులు, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల ఇన్‌చార్జి డాక్టర్ నరేశ్‌కుమార్ ఒక్కొక్కరి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. డీసీసీ అధ్యక్షులుగా పోటీ చేసే వారు పార్టీలో తమ సీనియార్టీతో కూడిన బయోడేటాను పరిశీలకులకు అందజేస్తున్నారు.

ఢిల్లీ నుంచే ఎంపిక

గతంలో మాదిరిగా కాకుండా ఈసారి డీసీసీ అధ్యక్ష ఎన్నికల్లో కీలక మార్పులు చేశారు. స్థానికంగా పార్టీ ప్రాధాన్యతలు దృష్టిలో పెట్టుకుని ఎంపిక చేస్తున్నారు. గతంలో ప్రజాప్రతినిధులు, గాంధీభవన్‌లో పీసీసీ చీఫ్, ముఖ్యమంత్రుల ఎంపికనే తుది నిర్ణయంగా ఉండేది. ఈసారి ఐదేళ్లు పార్టీ కోసం పని చేసిన వారిని అధ్యక్ష పదవికి అర్హులుగా పరిగణించి వారందరి నుంచి అర్జీలు తీసుకుని పరిశీలకులతో అభిప్రాయాలు సేకరించి ఎంపికకు కసరత్తు చేస్తున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికే పదవి దక్కేలా అందరినీ దృష్టిలో పెట్టుకుని జిల్లాకు కనీసం ముగ్గురు పేర్లతో కూడిన జాబితాను ఢిల్లీకి పంపిస్తే అక్కడ అన్ని రకాలుగా పరిశీలించి ఎంపిక చేస్తారని చెబుతున్నారు. ప్రస్తుతం ఏఐసీసీ పరిశీలకులు జాబితా మాత్రమే రూపొందించి.. ఫైనల్ చేయడం మాత్రం అధిష్టానం చేతిలో పెట్టారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకులు నరేశ్‌కుమార్, పక్కన పీసీసీ ఆర్గనైజర్లు, నాయకులు

పారదర్శకంగా అధ్యక్షుడి ఎన్నిక : ఏఐసీసీ పరిశీలకులు

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులను పారదర్శకంగా ఎంపిక చేస్తామని ఏఐసీసీ పరిశీలకులు డాక్టర్ నరేశ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సంఘటన్ సృజన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని నార్త్‌ఇన్ హోటల్‌లో పీసీసీ ఆర్గనైజర్లు అడువాల జ్యోతి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పులి అనిల్‌కుమార్, గిరిజన అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక విజయ్‌కుమార్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశవ్యాప్తంగా జిల్లాల వారీగా అధ్యక్ష పదవుల ఎంపిక జరుగుతోందని, అలాగే రాష్ట్రంలో చేపడుతున్నామని తెలిపారు. మొదట అధ్యక్ష, తర్వాత బ్లాక్, బూత్ స్థాయిలో నియామకాలు ఉంటాయన్నారు. పార్టీ కోసం పని చేసేవారికే అధ్యక్ష పదవి దక్కుతుందన్నారు. అధ్యక్ష ఎంపికలో స్థానిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను పరిశీలించి అధిష్టానానికి పంపుతామని అన్నారు. ఆసిఫాబాద్‌లో జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న వారితో ఒక్కొక్కరిగా మాట్లాడినట్లు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో మూడు నియోజకవర్గాల్లోనూ అభిప్రాయాల సేకరణ చేపడతామని తెలిపారు. వచ్చే ఎంపీ, అసెంబ్లీ ఎన్నికలు, కేంద్ర ఎన్నికల కమిటీల్లో కొత్తగా ఎంపికైన డీసీసీ అధ్యక్షులు ప్రధాన పాత్ర పోషిస్తారని తెలిపారు. అధ్యక్ష పదవికి కోసం దరఖాస్తులు అందజేయగా.. పార్టీ నుంచి కేవీ.ప్రతాప్, దయానంద్, డా.నీలకంఠేశ్వర్‌రావు, నూకల రమేశ్, గడ్డం త్రిమూర్తి తదితర నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో మంచిర్యాల నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులతో ఏఐసీసీ అబ్జర్వర్, పీసీసీ ఆర్గనైజర్లు సమావేశం అయ్యారు.

మద్దతు దక్కితేనే పదవి

డీసీసీ అధ్యక్ష పదవి కోసం జిల్లా నుంచి అనేక మంది పోటీలో ఉంటున్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలైన మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్‌తో పాటు ఖానాపూర్(జన్నారం మండలం) పరిధిలోని నాయకులు ఈ మేరకు అధ్యక్ష పదవిపై ఆశలు పెట్టుకున్నారు. దీంతో తమ పరిధిలో ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రితో కార్యకర్తలు, నాయకులు మద్దతు కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న జనరల్ కేటగిరీతోపాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, యువజన విభాగం నుంచి పలువురు పోటీ పడుతున్నారు. వీరిలో ఎక్కువ మంది నుంచి మద్దతు దొరికి ఎవరిని పదవి వరిస్తుందోనని పార్టీలో ఆసక్తి రేపుతోంది.

పీఎస్సార్‌కు సీఎం, డిప్యూటీ సీఎం పరామర్శ

- ఆసుపత్రిలో చికిత్సపై వైద్యులతో ఆరా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్)ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పరామర్శించారు. అనారోగ్యంతో హైదరా బాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను గురువారం కలిసి మాట్లాడారు. చికిత్సపై ఆయన సతీమణి, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, డాక్టర్ నాగేశ్వర్‌రావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాగా, ఎమ్మెల్యే ఇటీవల అస్వస్థతకు గురి కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.



పీఎస్సార్‌ను పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క

మహిళా శక్తి భవన్ పనులు పూర్తి చేయాలి

మంచిర్యాలటౌన్/చెన్నూర్/కోటపల్లి: మంచిర్యాలలో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం ఆయన భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం రుణ సదుపాయాలు కల్పిస్తోందని తెలిపారు. చెన్నూర్ మండలం కిష్టంపేట, చెన్నూర్ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, 2.0 వాటర్ ట్యాంకు పనుల పురోగతి పరిశీలించారు. చెన్నూర్‌లో మూత్రశాలలు వెంటనే నిర్మించాలని, తాగునీటి ట్యాంకు నిర్మాణం పూర్తి చేసి ఇంటింటికీ నీటి సరఫరా చేయాలని సూచించారు. కోటపల్లిలో గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి అభివృద్ధి పనులు పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, కమిషనర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.



ఇందిరా మహిళా శక్తి భవన్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నిందితులను అరెస్ట్ చేయాలి

చెన్నూర్: వేమనపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వారం రోజులైనా కేసులో పురోగతి లేదని, పోలీసులు స్పందించకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం 48గంటల్లో నిందితులను అరెస్టు చేయాలని డెడ్‌లైన్ విధించి ఐదు రోజులు కావస్తున్నా పోలీసుల్లో చలనం లేకపోవడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. నిందితులు అధికార కాంగ్రెస్ నాయకులు కావడంతో కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, వెంకటేశ్వర్‌రావు, నాయకులు బత్తుల సమ్మయ్య, రాపర్తి వెంకటేశ్వర్, మంత్రి రామయ్య, శివకృష్ణ, కమ్మల శ్రీనివాస్, జాడి తిరుపతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

బాధితులకు భరోసా కల్పించాలి

- ప్రజలకు అందుబాటులో ఉండాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ వారికి భరోసా కల్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. గురువారం ఆయన హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది సమస్యలు, విధులు, పని తీరుపై తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలు, స్టేషన్ పరిధిలో జరిగే నేరాలు, రౌడీషీటర్లు తదితర వాటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ విధులు బాధ్యతగా నిర్వర్తించాలని అన్నారు. మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ పాల్గొన్నారు.

21 నుంచి అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు



స్టేషన్ ఆవరణలోని పాత వాహనాలను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం: ఈ నెల 21 నుంచి 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీపీ అంబర్ కిషోర్‌ఝా ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్‌స్టేషన్లలో ఓపెన్ హౌజ్ నిర్వహించి పోలీసు విధులు, ఆయుధాలు, సాంకేతిక వినియోగం, త్యాగాలు తదితర విషయాలను తెలియజేస్తామని తెలిపారు. కానిస్టేబుల్ నుంచి పై అధికారుల వరకు పలు అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయని తెలిపారు. షార్ట్‌ఫిలిం తీసి 23లోగా స్పెషల్ బ్రాంచ్ కార్యాలయంలో అందించాలని, ఉత్తమమైన వాటిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామని పేర్కొన్నారు.

డైట్ సక్రమంగా అందించాలి

- వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్
- లక్సెట్టిపేట ఆస్పత్రిలో తనిఖీ

లక్సెట్టిపేట: రోగులకు డైట్‌ను సక్రమంగా అందించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. సిబ్బంది సమయపాలన, పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని, నూతన వైద్యులను త్వరలోనే నియమిస్తామని అన్నారు. సిబ్బంది హాజరు రిజిష్టర్ వివరాలను నమోదు చేసుకున్నారు. నూతన ఆసుపత్రి భవనం నిర్మాణం తర్వాత రోగుల సంఖ్య పెరిగిందని, ఐపీ, ఓపీ సంఖ్య చాలా ఎక్కువగా ఉందని చెప్పారు. రోగులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని, మెనూ పాటించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడి.. రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ యూనుస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రోగితో మాట్లాడుతున్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

ఆదాయం ఉన్నా బస్సుల్లేవు..!

- జిల్లాకు కేటాయింపు అంతంతే..
- ఇప్పటికీ చేరని ఈవీలు
- ఆమె చేతికి అందని ప్రగతిచక్రాలు



మంచిర్యాల బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో ఉన్న ఏకైన బస్సు డిపో మంచిర్యాలకు బస్సుల కేటాయింపు అంతంత మాత్రంగానే ఉంది. ఆర్టీసీకి ఆదాయం తెస్తున్నా బస్సుల మంజూరులో ఆలస్యం జరుగుతోంది. రద్దీ రూట్లలో ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఎక్స్‌ప్రెస్ బస్సులూ తక్కువే ఉన్నాయి. ఎలక్ట్రిక్ బస్సుల శకం మొదలైనా మంచిర్యాల డిపోకు కేటాయింపుపై ఊసే లేకుండా పోయింది. వాయుకాలుష్యంతో పర్యావరణానికి ఇబ్బంది కలిగించే వాహనాల స్థానంలో ఆర్టీసీ ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా డిపోలకు కేటాయించారు. జిల్లాకు ఒక్కటి కూడా చేరలేదు. ఇందిర మహిళా శక్తి పథకంలో అందించే బస్సుల కోసమూ అతివల ఎదురుచూపులు తప్పడం లేదు.

రద్దీ రూట్లలో కొరత

ప్రయాణికుల రద్దీ రూట్లలో బస్సుల కొరత ఏర్పడుతోంది. చెన్నూర్, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రూట్లలో రద్దీ ఎక్కువగా ఉంటోంది. బస్సుల్లో గంటల తరబడి నిల్చుని కిక్కిరిసి ప్రయాణిస్తుంటారు. హైదరాబాద్‌కు 44 లగ్జరీ, లహరీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఏమో గానీ ఎక్స్‌ప్రెస్ బస్సులను కుదించారు. తెల్లవారు జామున 3.45గంటలకు తప్పితే సాయంత్రం 7గంటలకు వరకు బస్సులు కనిపించవు. దీంతో మహిళలు గోదావరిఖని, కరీంనగర్ వరకు వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఎక్స్‌ప్రెస్ బస్సుల సంఖ్య పెంచాలనే డిమాండ్ పెరుగుతోంది. పండుగ వేళ రద్దీ ఎక్కువగా ఉండడం.. అదే తీరున డిపోకు ఆదాయం సమకూరుతోంది. రాఖీ పండుగ వేళ నాలుగు రోజుల పాటు 3.31లక్షల కిలోమీటర్లు బస్సులు తిప్పగా రూ.2.13కోట్ల ఆదాయం సమకూరింది. దసరా, బతుకమ్మ కోసం సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 6వరకు ప్రత్యేక బస్సులతో భారీగా ఆదాయం వచ్చింది. 198 ప్రత్యేక బస్సులు 59,536 కిలోమీటర్లు నడపడం ద్వారా 23,655 మంది ప్రయాణికులను చేరవేశారు. రూ.62,70,066 ఆదాయం సమకూరడంతో మిగతా డిపోల కంటే ముందుస్థానంలో నిలిచింది. పండుగలు, పర్యాటక సీజన్లతోపాటు ఉచిత ప్రయాణికులతో రద్దీగా మారుతోంది. కొత్త బస్సులు వస్తే కొంత మేర ఒత్తిడి తగ్గుతుంది.

'ఈవీ'లు వచ్చేదెన్నడో..!

ఈవీ బస్సుల శకం మొదలైనా డిపోకు కేటాయింపు జరగలేదు. ఇబ్బందులు లేని ప్రయాణం, ఇంధన ఖర్చు ఆదాతోపాటు ఈ బస్సుల వైపు ప్రయాణికులు మొగ్గ చూపుతున్నారు. ఆయా డిపోలకు బస్సులు మంజూరు చేసినా ఇక్కడి ప్రయాణికులకు ఎదురుచూపులు తప్పడం లేదు. అప్పట్లో బస్సుల చార్జింగ్‌కు ప్రతిపాదనలు చేసినా ఊసే లేకుండా పోయింది. రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ద్వారా ఇందిర మహిళా శక్తి పథకంలో మహిళా సంఘాల సభ్యులకు ఆర్టీసీ బస్సులు అందజేస్తోంది. ఈ పథకంలో మండల సమాఖ్యకు అద్దె బస్సుల కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదికలు అందించారు. అయినా ఆమె చేతికి ప్రగతిచక్రాలు చేరలేదు. దీంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్టీసీ అద్దె బస్సుల యజమానులు కాలేకపోతున్నారు. ఈవీ బస్సులతోపాటు మహిళా సమాఖ్యలకు బస్సులు కేటాయిస్తే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా మారనుంది.

40ఏళ్లలో 29..

మంచిర్యాల డిపో 1975లో ఫిబ్రవరి 6న ఏర్పాటు చేశారు. అదే సమయంలో బస్‌స్టేషన్‌లో తొమ్మిది ప్లాట్‌ఫారాలు, 32 బస్సులతో ప్రారంభించారు. 3.21 ఎకరాల్లో డిపో, 1.34 ఎకరాల్లో బస్టాండ్ నిర్మించారు. 1985 నాటికి 32 బస్సుల సంఖ్యను 118కి పెంచగా.. ప్రస్తుతం డిపో పరిధిలో 147 ఉన్నాయి. ఈ లెక్కన 40ఏళ్ల(1985నుంచి)లో 29 బస్సులు మాత్రమే డిపోకు కేటాయించారు. ఏడాదికి ఒక్క బస్సు కేటాయించినా 40బస్సులు రావాల్సి ఉండగా.. వివక్ష చూపినట్లు తెలుస్తోంది. ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్నా బస్సుల సంఖ్య పెరగకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. మంచిర్యాల బస్టాండ్ మీదుగా రోజుకు 62వేల కిలోమీటర్ల మేర బస్సులు నడపడం ద్వారా రూ.34లక్షల నుంచి రూ.36లక్షల(మహాలక్ష్మి పథకం కలిపి) వరకు ఆదాయం సమకూరుతుంది. ఏళ్ల తరబడి బస్టాండ్ విస్తరించకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. 1985లో నిర్మించిన తొమ్మిది ప్లాట్‌ఫారాలు మినహా ఒక్కటి కూడా అదనంగా ఏర్పాటు కాకపోవడంతో బస్సులు నిలిపేందుకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి.

ఘనంగా దండారీ వేడుకలు



నృత్యం చేస్తున్న ఆదివాసీలు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ సల్ఫాలవాగు వెంకటాద్రి ఆలయం వద్ద గురువారం ఆదివాసీల ఆధ్వర్యంలో దండారీ దర్బార్ ఘనంగా నిర్వహించారు. మండలం నుంచి ఐదు దండారీ బృందాలు పాల్గొని గుస్సాడీలతో ప్రదర్శనలు నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకునేందుకు ప్రతీ సంవత్సరం దండారీ దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వం దండారీకి రూ.15వేల చొప్పున చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై గంగారాం, ఓరియంట్ యూనిట్ హెడ్ బాలగిరిధర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు గొంది వెంకటరమణ, ఆదివాసీ నాయకులు కుంరం జనార్దన్, రాయిసిడాం రాందాస్, ఆడ జంగు, సోయం జంగు, కనకరాజు, ఆత్రం మహేష్, ఆత్రం జంగు, ఆడ జంగు, సోయం జంగు పాల్గొన్నారు.

రైతులు సామూహిక నివారణ చర్యలు చేపట్టాలి

సాక్షి ఎఫెక్ట్

నెన్నెల: మండలంలోని నందులపల్లి గ్రామంలో మండల వ్యవసాయాధికారులు గురువారం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. పండ్లు, పత్తి, కూరగాయల తోటలకు హాని కలిగిస్తున్న నత్తలను గుర్తించారు. ఈ నెల 12న 'సాక్షి'లో 'పంటలపై దండెత్తిన నత్తలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అ ధికారులు స్పందించారు. నత్తల నివారణపై రైతుల కు అవగాహన కల్పించారు. ఏఓ సృజన మాట్లాడు తూ ఉద్యాన, వ్యవసాయ పంటలపై ఆశించి విపరీ తంగా నష్టం కలిగిస్తున్న నత్తలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామూహిక నివా రణ చర్యలు చేపట్టాలని పలు సూచనలు చేశారు.



నత్తలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

- మెటాల్డిహైడ్ 2.5శాతం డీపీని ఎకరానికి రెండున్నర కిలోల చొప్పున సాయంత్రం పూట పొలాల్లో అక్కడక్కడ చల్లాలి.
- నత్తలు పంట పొలాల్లోకి రాకుండా చుట్టూ గడ్డ ఉప్పు చల్లాలి. నత్తలను ఏరి ఉప్పు నీటిలో వేయడంతో అవి నశించిపోతాయి.
- కిలో ఉప్పు నాలుగు లీటర్ల నీటిలో కలిపి ఆ ద్రావణంలోనే గోనెసంచులు తడిపి గట్లపై ఉంచడంతో ఘాటుకు అటువైపు రావు.
- రాత్రివేళ పంట పొలాల్లో నీరు పారించకుండా పగటిపూట నీరు పెట్టాలి. గాలి వెలుతురు సోకేలా చర్యలు తీసుకోవాలి.
- జూలై నుంచి ఫిబ్రవరి మధ్య కాలంలో వాటికి సంతనోత్పత్తికి అనువైన సమయం. ఆ సమయంలో రైతులంతా నివారణ చర్యలు చేపడితేనే పూర్తిగా నివారించవచ్చు.

క్లుప్తంగా

స్వగ్రామం చేరిన మృతదేహం


గోపు భూమయ్య (ఫైల్)

నర్సాపూర్(జి): ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశం దుబాయ్ వెళ్లిన మండలంలోని తిమ్మాపూర్ (జి) గ్రామానికి చెందిన గోపు భూమయ్య (42) నెల రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా గురువారం మృతదేహం స్వగ్రామానికి చేరింది. గ్రామానికి చెందిన గోపు భూమయ్య దుబాయ్‌లోని సోనాపూర్ ప్రాంతంలో గల సీఆర్‌సీ కంపెనీలో ఏడాదిన్నరగా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నెల రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందగా యూఏఈ హెల్పింగ్ ఆర్గనైజేషన్ సంస్థ సహకారంతో బొమ్మ ప్రవీణ్, బొడ్డుపల్లి రాము, గన్నారపు హన్మాండ్లు, శ్రీనివాస్ కంపెనీ యాజమాన్యం, పీఆర్వోలతో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించే ఏర్పాట్లు చేశారు. గురువారం స్వగ్రామానికి మృతదేహం చేరడంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఇచ్చోడ: మండలంలోని అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకు తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కొంతమంది ట్రాక్టర్ యజమానులు ఇసుకను తరలించి మండల కేంద్రంలో విక్రయిస్తున్నట్లు తెలిసింది. అటవీ శాఖ అధికారి పుండలిక్ రెండు రోజుల క్రితం ట్రాక్టర్‌ను పట్టుకోగా గురువారం టైగర్‌జోన్ అధికారులు మరో మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈ మేరకే కేసులు నమోదు చేసి ట్రాక్టర్లను సీజ్ చేశారు.

బాలిక అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: తలమడుగు మండలంలోని దహెగాంలో అత్తాగారి ఊర్లో నివాసం ఉంటున్న మహారాష్ట్రకు చెందిన ఆకాష్ కూతురు అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 13న భార్యభర్తలు కూలీ పనులకు వెళ్లగా కూతురు కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసును తలమడుగు పోలీసు స్టేషన్‌కు బదిలీ చేయనున్నట్లు వివరించారు.

కాసిపేట గని ఎదుట ఖాళీ బిందెలతో నిరసన


నిరసన తెలుపుతున్న మహిళలు

కాసిపేట: నీటిసమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ ఆధ్వర్యంలో మందమర్రి ఏరియా కాసిపేట గని ఎదుట గురువారం మహిళలు, గ్రామస్తులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మండలంలోని ముత్యంపల్లి, చిన్నధర్మారం, కాసిపేట గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, నిధుల కొరత అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు మేనేజర్ నిఖిల్ అయ్యర్ మూడు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు బాకీ కిరణ్, ప్రసన్న, మహిళలు పోసు, లచ్చక్క, కవిత, పద్మ, మహేశ్వరి, లక్ష్మి, యువకులు పాల్గొన్నారు.

విప్లవోద్యమం ఇక చరిత్రే!

- ఇప్పటికే ఎంతోమంది ఎన్‌కౌంటర్
- మరికొందరు లొంగుబాటు..
- మావోల శకం ముగిసినట్లే..?

బెల్లంపల్లి: పూర్వ పీపుల్స్‌వార్ ప్రస్తుత మావోయిస్టుపార్టీ విప్లవోద్యమ చరిత్రలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఎంతో ప్రత్యేకత ఉంది. విప్లవ పంథాకు ఆకర్షితులైన ఎందరో యువతీ, యువకులు సమసమాజ స్థాపన కోసం నాలుగున్నర దశాబ్దాల క్రితం అడవి బాట పట్టారు. సాయుధ పోరాటం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమని ధృఢంగా నమ్మి తల్లిదండ్రులు, తోబుట్టువులను వదిలి విప్లవమార్గం అనుసరించారు. నిరుపేద, కార్మిక, కర్షక కుటుంబాల నుంచి విద్యావంతులు, యువకులు ప్రాణత్యాగాలకు వెరవకుండా తుపాకి పోరాటంలో భాగస్వాములయ్యారు. అడవుల జిల్లా నలుమూలల పోరాట బీజాలు నాటి ఒకానొక దశలో సమాంతరంగా కార్యకలాపాలు సాగించారు. మందుపాతరలు పేల్చి పోలీసులను హతమార్చారు. కరువు దాడులు చేశారు. పోలీస్‌స్టేషన్‌లను టార్గెట్‌గా చేసి ఆయుధాల అపహరణకు సిద్ధపడ్డారు. నక్సలైట్‌ల ఏరివేతలో భాగంగా పోలీసులు జరిపిన ఎదురు కాల్పుల్లో ఎందరో అసువులు బాశారు. పచ్చటి అడవులు నెత్తుటేరులతో ఎరుపెక్కాయి. 1980 దశకం నుంచి 1995 వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విప్లవ జ్వాలలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఆతర్వాత పోలీసులు వ్యూహాత్మకంగా పట్టుసాధించి పదుల సంఖ్యలో నక్సలైట్లను ఎన్‌కౌంటర్‌లలో హతమార్చారు.

జగిత్యాల జైత్రయాత్ర వెల్లువలో...

పీపుల్స్‌వార్ వ్యవస్థాపక ఆద్యుల్లో ముఖ్యుడైన కొండపల్లి సీతారామయ్య సారథ్యంలో జగిత్యాల జైత్రయాత్ర జరిగింది. ఆ పరిణామాల క్రమంలో 1978–79 ప్రాంతంలో బెల్లంపల్లికి చెందిన గజ్జెల గంగారాం, పెద్ది శంకర్, 1980, 81ప్రాంతంలో కటకం సుదర్శన్ విప్లవ భావజాలానికి ఆకర్షితులై అమరుడు నల్లా ఆదిరెడ్డి మార్గదర్శకంలో పీపుల్స్ వార్ గ్రూప్‌ను విస్తరించారు. వీరి నేతృత్వంలో విప్లవ కార్యకలాపాలు ముమ్మరంగా సాగాయి. అడవుల జిల్లా అంతటా పీపుల్స్‌వార్ వేళ్లూనుకుని బలీయమైన శక్తిగా రూపాంతరం చెందింది. విప్లవ పోరాటాన్ని తీవ్రతరం చేయడంలో బెల్లంపల్లి, మందమర్రి, చెన్నూర్, ఆసిఫాబాద్, నిర్మల్, బోథ్, ఆదిలాబాద్, సిర్పూర్, తదితర ప్రాంతాలకు చెందిన ఎందరో కీలక భూమిక పోషించారు.

అమరత్వం... లొంగుబాటు...

విప్లవోద్యమంలో బెల్లంపల్లికి చెందిన పెద్ది శంకర్, గజ్జెల గంగారాం తొలి అమరులుగా చరిత్ర కెక్కారు. మొన్నటి జాడి వెంకటి వరకు విప్లవ ఆశయం సిద్ధించకుండానే నెత్తుటి బాటలో అనేకమంది నేలరాలారు. వ్యక్తిగత బలహీనతలు, అనారోగ్య సమస్యలు, పోలీసు నిర్బంధాన్ని తట్టుకోలేక వందలాది మంది జనజీవన స్రవంతిలో కలిశారు. పక్షం రోజుల క్రితం దండకారణ్యంలో పనిచేస్తున్న చెన్నూర్ ప్రాంతానికి చెందిన మావోయిస్టు దంపతులు ఆత్రం లచ్చయ్య, పద్మ పోలీసుల ఎదుట లొంగిపోయారు. తాజాగా దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ) సెక్రెటరీగా పనిచేసిన బెల్లంపల్లికి చెందిన సలాకుల సరోజ ఉరఫ్ లత ఉరఫ్ దీప, ఆమె భర్త నిర్మల్ జిల్లా కూచన్‌పల్లి వాసి దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌చార్జి ఇర్రి. మోహన్‌రెడ్డి ఉరఫ్ వివేక్ గడ్చిరోలిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పఢ్నవీస్‌కు ఆయుధాన్ని అప్పగించి విప్లవ జీవితానికి ముగింపు పలికారు. వీరి లొంగుబాటు నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల ప్రభావం దాదాపు కనుమరుగై పోయినట్లేనని చర్చించుకుంటున్నారు.

అజ్ఞాతంలో ఉన్నది ఇంకెందరు?

సరోజ, మోహన్‌రెడ్డి దంపతుల లొంగుబాటు అనంతరం మావోయిస్టు పార్టీ విప్లవోద్యమంలో ప్రస్తుతం అజ్ఞాతంలో ఎందరున్నారనే చర్చ జరుగుతోంది. దండకారణ్యం కేంద్రంగా పని చేస్తున్న మావోయిస్టుపార్టీ ముఖ్య నాయకుడు, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) కార్యదర్శిగా వ్యవహరిస్తున్న మందమర్రికి చెందిన బండి ప్రకాష్ (ఇతను కూడా ప్రభుత్వానికి లొంగిపోతారనే ప్రచారం జరుగుతోంది), మరో మావోయిస్టు అగ్రనాయకుడు కోటపల్లి మండలం బబ్బెర చెలక గ్రామవాసి మూల దేవేందర్ రెడ్డి, బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామానికి చెందిన జాడి పుష్ప, బెల్లంపల్లి శాంతిఖని బస్తీకి చెందిన కృష్ణ, మరో యువకుడితో పాటు మరి కొంతమంది విప్లవ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వీరు మినహా ఉమ్మడి జిల్లాలో మరెవరూ అజ్ఞాతంలో లేనట్లుగా మాజీ మావోయిస్టులు, విప్లవ సానుభూతి పరులు పేర్కొంటున్నారు. పోలీసు రికార్డులకెక్కిన మావోయిస్టుల్లో దండకారణ్యంలో పనిచేస్తున్న వారు తప్పా ప్రస్తుతం భౌతికంగా ఏ ఒక్కరు లేనట్లుగా చెబుతున్నారు. ఈక్రమంలో నాలుగున్నర దశాబ్దాల పోరాట వారసత్వం కలిగిన ఉమ్మడి జిల్లా విప్లవ ప్రస్థానం ఇక చరిత్ర పుటలకు పరిమితం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్తగా మావోయిస్టు పార్టీలో రిక్రూట్‌మెంట్ నిలిచి పోవడంతో ఉద్యమ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

ఉద్యోగ వేట ఇక సులభతరం

- నిరుద్యోగుల కోసం 'డీట్' యాప్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం



డీట్ వెబ్‌సైట్

బోథ్: డిజిటల్ యుగంలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతతో కూడిన 'డీట్' (డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ) యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. నిరుద్యోగులు, ప్రైవేటు రంగ సంస్థల మధ్య ప్రత్యక్ష వారధిగా ఈ యాప్ పనిచేయనుంది.

పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షణ

పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థల సమన్వయంతో ఇది పర్యవేక్షించబడుతుంది. తద్వారా, అభ్యర్థులు తమ అర్హతలకు తగిన ప్రైవేటు రంగ ఉద్యోగ అవకాశాలను సులభంగా పొందేందుకు మార్గం సుగమం అవుతుంది. పరిశ్రమలు, నిరుద్యోగులు ఈ యాప్‌లో నమోదు చేసుకుంటే కంపెనీలు తమకు అవసరమైన, స్కిల్ ఉన్న వారికి సందేశాన్ని పంపిస్తారు. వందల కంపెనీలన్నీ ఒకే చోట ఉండటంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉటుంది.

అర్హతలు, నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగాలు

డీట్ యాప్ ద్వారా పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఆపై చదివిన అభ్యర్థులు ప్రయోజనం పొందవచ్చు. వారి విద్యార్హత, నైపుణ్యాలు, అనుభవం ఆధారంగా కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుంది. డిగ్రీ చదువుతున్న అభ్యర్థులకు కూడా నమోదు చేసుకునే అవకాశం కల్పించడం అదనపు విశేషం. ఫార్మా, ఇండస్ట్రియల్, బీపీవో, కస్టమర్ ఎగ్జిక్యూటివ్ సపోర్ట్, బిజినెస్ డెవలప్‌మెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్‌తో పాటు అనేక ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి.

- నిరుద్యోగులు, ఉద్యోగాలు కల్పించే ఔత్సాహిక కంపెనీలు ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు.
- కంపెనీ నిర్వాహకులు, యాప్‌లో నమోదైన అభ్యర్థుల విద్య, నైపుణ్య వివరాలను పరిశీలించి, నేరుగా వారిని సంప్రదిస్తారు.
- కంపెనీల నియమావళిని బట్టి రాత లేదా మౌఖిక పరీక్షలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయానికి ఇందులో అవకాశం ఉండదు.

నమోదు విధానం

- నిరుద్యోగులు తమ పూర్తి వివరాలను డీట్ యాప్‌లో లేదా అధికారిక వెబ్‌సైట్ www.deet.telangana.gov.in లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా యాప్‌ను తెరవాలి.
- విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, అనుభవం, ఇంటర్న్‌షిప్‌ల వివరాలు నమోదు చేయాలి.
- పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్, అప్రెంటిస్‌షిప్‌లలో దేని కోసం అన్వేషిస్తున్నారో, ఏ రంగంలో ఉద్యోగం కావాలో స్పష్టం చేయాలి.
- విద్యార్హత పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో నమోదు ప్రక్రియ పూర్తవుతుంది.

భార్యను కడతేర్చిన భర్త

- మద్యం తాగొద్దని మందలించిందని గొడ్డలితో నరికి హత్య
- ఆదిలాబాద్ జిల్లా సీతాగోందిలో ఘటన


రక్తపు మడుగులో లక్ష్మీబాయి మృతదేహం

గుడిహత్నూర్: మద్యం తాగొద్దని మందలించిన భార్యను గొడ్డలితో నరికి చంపిన సంఘటన మండలంలో సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సీతాగోంది గ్రామానికి చెందిన సిడాం సంతోష్, లక్ష్మీబాయి (35) దంపతులు కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సంతోష్ మద్యానికి బానిసై తరచూ ఇంట్లో భార్యతో గొడవపడేవాడు. గురువారం ఉదయం సైతం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. తాగి మోటార్ సైకిల్ నడుపొద్దని లక్ష్మీబాయి మందలించింది. మద్యం మత్తులో ఉన్న సంతోష్ కోపంతో ఇంట్లో ఉన్న గొడ్డలితో ఆమె చెంప భాగంలో బలంగా కొట్టడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తన భార్యను హత్య చేశానని పోలీసులకు లొంగిపోయాడు. సీఐ బండారి రాజు, ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై అన్వర్

లక్సెట్టిపేట: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఎల్లారం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వావిలాల రమేశ్ (39) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మంచిర్యాలకు వెళ్లి అతిగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. మద్యం మత్తులో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. మృతుని భార్య రజిని ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వివాహిత..


మాధవి (ఫైల్)

బాసర: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ సాయికుమార్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని హజిని గ్రామానికి చెందిన మాధవి (23)కి బాసర మండలంలోని దౌడాపూర్ గ్రామానికి చెందిన కర్మానే మనోజ్‌తో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం వారికి ఇద్దరు పిల్లలు సంతానం. కొంతకాలంగా మనోజ్ మద్యం సేవించి ఇంటికి వచ్చి అదనపు కట్నం తేవాలని మాధవిని మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేసేవాడు. దీంతో మనస్తాపానికి గురైన మహిళ బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. భర్త వేధింపులతోనే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తండ్రి రాంచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..


బుచ్చన్న (ఫైల్)

లక్ష్మణచాంద: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఒడ్డెపెల్లి గ్రామానికి చెందిన పల్లపు బుచ్చన్న (52) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఈ నెల 13న గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


సుధాకర్ (ఫైల్)

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన భీమా సుధాకర్ (65) మృతి చెందాడు. గద్దెరాగిడిలోని ఓ కిరాణ దుకాణానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో వేగంగా ఢీకొనడంతో తీవ్రగాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని వెంటనే మంచిర్యాల ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


నేరడిగొండ: మండలంలోని బుద్దికొండ గ్రామ సమీపంలో స్థానిక రైతు నవీన్ రెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి (45) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు తెల్లటి చొక్కా, జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్లు తెలిపాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. వివరాలు తెలిసిన వారు 8712659947 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

వేర్వేరు చోట్ల ఇద్దరికి పాము కాటు


వైశాలికి చికిత్స చేస్తున్న ఈఎంటీ అనిల్ ➤

బేల: మండలంలోని సిర్సన్న, జూనోని రెవెన్యూ గ్రామ శివారుల్లోని పొలాల్లో గురువారం ఇద్దరు రైతులు పాముకాటుకు గురయ్యారు. సిర్సన్న గ్రామ శివారులోని పొలంలో పనిచేస్తున్న బబన్‌కు, జూనోని గ్రామ శివారులోని పొలంలో పనిచేస్తున్న వైశాలిని వేర్వేరుగా పాములు కాటేశాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ అనిల్, పైలెట్ అర్షద్‌ఖాన్ బాధితులకు ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

కడెం ప్రాజెక్ట్ గేటు ఎత్తివేత


కడెం ప్రాజెక్ట్

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు గురువారం రాత్రి 1000 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో రావడంతో ఇరిగేషన్ అధికారులు ఒక వరద గేటు ఎత్తి 4,178 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇన్‌ఫ్లో పెరిగితే మరిన్ని గేట్లు ఎత్తనున్నట్లు అధికారులు వెల్లడించారు.

నిజాయతీ చాటుకున్న సాయితేజ


బ్యాగును అప్పగిస్తున్న పోలీసులు

లోకేశ్వరం: మండలంలోని పుస్పూర్ గ్రామానికి చెందిన గొడిసెల సాయితేజగౌడ్ దొరికిన బ్యాగును లోకేశ్వరం పోలీసులకు అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు. బుధవారం నిజామాబాద్ నుంచి పుస్పూర్‌కు బైక్‌పై వస్తున్న సాయితేజకు నందిపేట్ మండలం పలుగుగుట్ట సమీపంలో ఓ హ్యాండ్‌బ్యాగు దొరికింది. అందులో సెల్‌ఫోన్, రెండు గ్రాముల బంగారం, ఆధార్ కార్డు ఉంది. ఆధార్ ఆధారంగా నందిపేట్ మండల కేంద్రానికి చెందిన ప్రవళికగా గుర్తించి లోకేశ్వరం పోలీసులకు బ్యాగ్‌ను అప్పగించాడు. సుమారు రూ.40 వేల విలువైన వస్తువులను అప్పగించిన యువకుడిని పోలీసులు అభినందించారు. గురువారం పోలీసులు బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి బ్యాగును అప్పగించారు.

డబ్బులు దండుకున్న మధ్యవర్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: మధ్యవర్తిగా వ్యవహరిస్తూ కోర్టులో తీర్పు అనుకూలంగా వచ్చేలా చూస్తానని, పెద్దల సమక్షంలో సెటిల్‌మెంట్ చేస్తానని డబ్బులు వసూలు చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు. హైకోర్టులో జడ్జీలు, న్యాయవాదులు పరిచయం ఉన్నారని నమ్మబలికి బాధితుల నుంచి రూ.3 లక్షల 50వేలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్ నగర్‌కు చెందిన ఫిర్యాదుదారు కుమారుడు, కోడలు మధ్య గొడవలు ఉన్నాయి. మధ్యవర్తిగా పరిచయం ఉన్న జైనూర్ మండలంలోని బూసిమెట్టకు చెందిన జాడే రవీందర్ బాధితులను నమ్మబలికి అందినకాడికి దండుకున్నాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నాడు. మొదట రూ.3లక్షలు ఇవ్వగా ఆ తర్వాత కేసు నమోదు చేయిస్తానని బెదిరించి మరో రూ.50 వేలు తీసుకున్నాడు. డబ్బులు అడిగితే బెదిరింపులకు పాల్పడడంతో బాధితురాలు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

42 కిలోల గంజాయి దహనం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో నమోదైన 18 కేసుల్లో పట్టుబడిన 42 కిలోల గంజాయిని గంజాయి డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలోని శ్రీ మెడికేర్ సర్వీసెస్ సెంటర్‌లో గురువారం గంజాయి డిస్పోజల్ చేశారు. ఇందులో 22 కిలోల గంజాయి మొక్కలు, 20 కిలోల ఎండు గంజాయిని దహనం చేశారు. అడిషనల్ ఎస్పీ సురేందర్ రావు, డీసీఆర్‌బీ సీఐ హకీమ్ ఈ ప్రక్రియను పరిశీలించారు.

హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు


క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ముఖేష్‌గౌడ్

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల క్లబ్‌లో గురువారం నిర్వహించిన అండర్–14, 17, 19 బాలబాలికల జోనల్ స్థాయి ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేష్‌గౌడ్ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొనగా ఒక్కో గ్రూపు నుంచి ఐదుగురు చొప్పున 30 మంది ఎంపికయ్యారు. అండర్–14 హైదరాబాద్, అండర్–17 మేడ్చల్, అండర్–19 మహబూబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి యాకూబ్ తెలిపారు. కార్యక్రమంలో అండర్–19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబురావు, బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పులూరి సుధాకర్, జెడ్పీబాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండి రమేశ్, ఫిజికల్ డైరెక్టర్ రేణి రాజయ్య, కుమురంభీం జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

గెలిచిన సంఘాలు విఫలం

- సీఐటీయూ అధ్యక్షుడు టీ.రాజారెడ్డి


మాట్లాడుతున్న రాజారెడ్డి

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో గెలిచిన సంఘాలు విఫలమయ్యాయని సీఐటీయూ కేంద్ర కమిటీ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి ఆరోపించారు. గురువారం ఆర్కే 7 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహించడం లేదని, ఇన్వాలిడేషన్ అయిన వారి స్థానంలో డిపెండెంట్లకు కారుణ్య ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. కార్మికుల సమస్యలపై కొట్లాడటానికి వేదికలైన స్ట్రక్చర్ సమావేశాలు బహిష్కరించి ఇక్కడ గనులపై మెమోరాండాలు ఇస్తూ కార్మికులను ఆయోమయానికి గురిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు గుల్ల బాలాజీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కస్తూరి చంద్రశేఖర్, నాయకులు వెంగళ కుమారస్వామి, వెంకట్‌రెడ్డి, సమ్మయ్య, ప్రవీణ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవర ఆలయంలో చోరీ


ఆలయంలో పరిశీలిస్తున్న సీఐ వేణుచందర్

భీమారం: మండల కేంద్రంలోని లక్ష్మీదేవర ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ముదిరాజ్ సంఘం పెద్దలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సమీపంలోని పత్తి చేను మీదుగావచ్చిన దుండగులు మొదట ఆలయం తలుపులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. హుండీలో ఉన్న 4 కిలోల 500గ్రాములు వెండి, రూ. 36 వేల నగదు, అమ్మవారిపై ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆలయంలో ఇంత పెద్దఎత్తున వెండి ఉందన్న సమాచారం దొంగలకు ఎలా చేరిందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మందు పార్టీ చేసుకుని దోపిడీ

చోరీకి పాల్పడిన దొంగలు మొదట సమీపంలోని పత్తి చేనులో మందు పార్టీ చేసుకున్నట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పథకం ప్రకారం మొదట ఆలయ పరిసర ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఆలయం ఎదుటే నివాస గృహాలు ఉన్నప్పటికీ దుండగులు దోచుకుని యథేచ్ఛగా వెళ్లి పోవడం వెనుక స్థానికులు ఎవరైనా వారికి సహకరించారా? అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

500 మీటర్ల దూరంలోనే పోలీస్‌స్టేషన్

పోలీస్‌స్టేషన్‌కు కేవలం 500 మీటర్ల దూరంలోనే చోరీ, జాతీయ రహదారికి సమీపంలోనే చోరీ జరగడం మండలంలో సంచలనంగా మారింది.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ

సంఘటన స్థలాన్ని శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ గురువారం సందర్శించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. డాగ్‌స్క్వాడ్‌తో పరిసరాలు గాలించగా అది పత్తిచేనులోకి వెళ్లి ఆగిపోయింది. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ట్రయల్ పేరిట బైక్..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని భుక్తాపూర్‌కు చెందిన సయ్యద్ రఫీక్ ఆటో కన్సల్టెన్సీ టూవీలర్ పర్చేజ్ అండ్ సేల్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. బుధవారం బైక్ కొనుగోలు చేసేందుకు వచ్చిన ఓ వ్యక్తి ట్రయల్ కోసం బండిని కొంతదూరం వరకు తీసుకెళ్లి తిరిగి రాలేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

పశువులను తరలిస్తున్న లారీ పట్టివేత


పట్టుబడిన లారీతో పోలీసులు


మృతి చెందిన పశువులు

బోథ్: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు పశువులను తరలిస్తున్న లారీని గురువారం సోనాల మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. తమకు అందిన సమాచారం మేరకు పోలీసులు ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పదంగా ఉన్న లారీని ఆపి పరిశీలించగా అందులో పశువులు కనిపించాయి. లారీలో 26 పశువులు ఉండగా రెండు మృతి చెంది ఉన్నాయి. వాహనాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న పశువులను బజార్ హత్నూర్‌లోని గోశాలకు తరలించినట్లు ఎస్సై శ్రీసాయి పేర్కొన్నారు. లారీ ఓనర్‌తో పాటు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.